సాక్షి
నాగర్‌కర్నూల్
ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024



గుండె భద్రమేనా..?

ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు గుండెపోటుతో మృతిచెందుతున్నారు.

వివరాలు 8లో ▸



బీసీ డిక్లరేషన్ గుర్తులేదా..

కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ చేసి మరిచిపోయిందని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.3 /21.3


వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ ప్రభావం ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

అక్రమార్కులకు వత్తాసు

జిల్లాకేంద్రంలో పెచ్చుమీరుతున్న ప్రజాప్రతినిధుల అవినీతి

- హౌసింగ్ అనుమతులతో యథేచ్ఛగా కమర్షియల్ భవనాల నిర్మాణం
- డబ్బులిస్తే ఓకే.. లేకుంటే టార్గెట్టే
- నిర్మించాలన్నా.. కూల్చాలన్నా.. వారిదే తుది నిర్ణయం
- మున్సిపాలిటీ ఆదాయానికి గండికొడుతున్న వైనం



జిల్లాకేంద్రంలో అక్రమ నిర్మాణం అని షట్టర్లు తొలగించిన ఓ భవనం

నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రంలో కొందరు కౌన్సిలర్ల అవినీతి, అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి. అక్రమార్కులకు వంతపాడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. తమ కనుసన్నల్లో ఉంటూ అడిగిన కాడికి ముట్టజెప్పితే వదిలేస్తూ.. మాట వినని వారిని భయపెడుతూ అజమాయిషీ చెలాయిస్తున్నారు. ఒకవేళ తమకు నయానో.. భయానో ముట్టజెప్పకుండా నిర్మాణాలు చేపడితే ఏదో రకంగా నిర్మాణాలను కూల్చివేయించడం.. లేదా నిబంధనల పేరుతో సదరు యజమానులను ఇబ్బందులకు గురిచేయడం పరిపాటిగా మారింది. మున్సిపల్ నిబంధనల్లో లొసుగులతో అక్రమ నిర్మాణదారుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నారు. మున్సిపాలిటీలో రాజకీయ నాయకుల జోక్యం మితిమీరడంతో అధికారులు సైతం ఏమీ చేయలేక గమ్మునుంటున్నారు.

హౌసింగ్ అనుమతులతో..

2016లో నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రం కాగా.. పట్టణం వేగంగా విస్తరించింది. మున్సిపాలిటీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడం, నిర్మాణాలు పెరగడంతో అప్పటి అధికార పార్టీ కౌన్సిలర్లు వాటినే ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. ప్రధాన రహదారిపై నిర్మాణాలు చేపట్టాలనుకునే వారు అనుమతుల ఖర్చు, ప్రతిఏటా పన్నులు తగ్గించుకునేందుకు హౌసింగ్ అనుమతులు తీసుకుని.. చాలాచోట్ల కమర్షియల్ నిర్మాణాలు చేపట్టారు. వీటిని ఆసరాగా చేసుకుని కొందరు కౌన్సిలర్లు యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడ్డారు. ఇటీవల ప్రభుత్వం మారే వరకు తాము చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరించారు. తమకు డబ్బు ఇచ్చిన వారి వైపు అధికారులు కన్నెత్తి చూడకుండా చేయడం.. తమ దృష్టికి రాకుండా నిర్మాణాలు చేపట్టే వారిపై ఫిర్యాదులు చేసి యజమానులను ఇబ్బందులకు గురిచేశారు.

అధికారుల ద్వంద్వ వైఖరి

జిల్లాకేంద్రంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల పట్ల అధికారులు ద్వంద వైఖరి ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జిల్లాకేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో ఓ వ్యక్తి చేపడుతున్న నిర్మాణం అక్రమం అని, హౌసింగ్ పేరిట అనుమతి తీసుకుని కమర్షియల్ నిర్మాణం చేపట్టారని పెద్దఎత్తున ఫిర్యాదులు రావడం, కొన్ని పత్రికల్లో వార్తలు సైతం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి సదరు నిర్మాణానికి బిగించిన షట్టర్‌ను తొలగించారు. అయితే ఇదే విధంగా మిగతా అక్రమ నిర్మాణాలపై అధికారులు స్పందించడం లేదని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్మాణాన్ని చేపట్టిన యజమాని గతంలో ముగ్గురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు రూ.40 వేలు, అప్పట్లో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసిన ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి రూ.82 వేలు, మరోమారు రూ.18 వేలు ముట్టజెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారిపై ఓ కళాశాల ఎదుట వివాదాస్పద స్థలంలో నిర్మించిన షట్టర్లకు, నాగనూల్ రోడ్డులో కొన్ని కమర్షియల్ నిర్మాణాలకు సైతం హౌసింగ్ అనుమతులు ఉన్నట్లు తెలిసింది. వీటి వెనక పెద్దఎత్తున డబ్బులు చేతులు మారినట్లు సమాచారం. వీటితోపాటు మున్సిపాలిటీ పరిధిలో దాదాపు మరో 20- 25 కమర్షియల్ నిర్మాణాలకు హౌసింగ్ అనుమతులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే అధికార యంత్రాంగం వీటన్నింటిపై చర్యలు తీసుకుంటారా.. లేక కౌన్సిలర్లకు వత్తాసు పలుకుతారా అనేది తేలాల్సి ఉంది.

నిర్మాణాలు నిలిపివేశాం..

హౌసింగ్ పర్మిషన్ తీసుకుని కమర్షియల్ భవనాలు నిర్మిస్తున్న కొన్నింటినీ నిలిపివేశాం. వీటికి నోటీసులు కూడా ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన వాటికి కొన్నింటికి జరిమానా, మరికొన్నింటికి కమర్షియల్ టాక్స్ వసూలు చేస్తున్నాం. ఇంకా అలాంటి నిర్మాణాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి.. వాటిపై కూడా చర్యలు తీసుకుంటాం.
– వికాస్, టౌన్ ప్లానింగ్ అధికారి, నాగర్‌కర్నూల్

న్యూస్‌రీల్

వెల్దండ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఐజీ



వెల్దండ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ శనివారం మల్టీ జోన్–2 ఐజీ సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి.. నేరాలు, రోడ్డు ప్రమాదాలు, చోరీలు తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణాను అరికట్టాలన్నారు. ఇసుక రవాణా, రేషన్ బియ్యం తరలింపు, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. పోలీసులు ప్రజలకు 24 గంటల పాటు అందుబాటులో ఉండాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి, పనితీరును ప్రశంసించారు. ఆయన వెంట కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐ కురుమూర్తి, సిబ్బంది తదితరులున్నారు.

3 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

నాగర్‌కర్నూల్: ఓపెన్ స్కూల్ సొసైటీ సప్లిమెంటరీ పరీక్షలను అక్టోబర్ 3 నుంచి 9 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ గోవిందరాజులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాకేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పదో తరగతి పరీక్షలకు బాలికల ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులు, ఇంటర్‌కు సంబంధించి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 170 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారన్నారు. అలాగే అక్టోబర్ 16 నుంచి 23 వరకు ప్రాక్టికల్ పరీక్షలు మహబూబ్‌నగర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ఆయా మండలాల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ల వద్ద హాల్ టికెట్లను తీసుకోవాలని, పూర్తి వివరాల కోసం నాగర్‌కర్నూల్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శివప్రసాద్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపు జాబ్‌మేళా

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో సోమవారం హెచ్‌సీఎల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022, 2023, 2024 సంవత్సరాల్లో వృత్తి విద్యా కోర్సుల్లో 75 శాతం ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన వారు పదో తరగతి మెమోతోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్, ఆండ్రాయిడ్ ఫోన్‌తో హాజరుకావాలని సూచించారు.

పోలీస్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తా



నాగర్‌కర్నూల్ క్రైం/ అచ్చంపేట రూరల్: జిల్లాలో పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ సిబ్బందితో పోలీస్ దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా సమస్యలు ఉంటే సిబ్బంది తనకు తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తానని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రామేశ్వర్, ఏఆర్ ఏఎస్పీ భరత్, డీఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

■ వార్షిక తనిఖీల్లో భాగంగా అచ్చంపేట డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ రికార్డులు, సిబ్బంది కిట్ ఆర్టికల్స్, ఆయుధ సామగ్రిని తనిఖీ చేసి సిబ్బంది కవాతు నైపుణ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రవీందర్, శంకర్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'సింగిల్ విండోలను బలోపేతం చేస్తాం'

పాన్‌గల్: రైతులకు మేలు చేకూర్చేందుకు సింగిల్‌విండోలను అన్నివిధాలుగా బలోపేతం చేస్తామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పాన్‌గల్‌లోని పీఏసీఎస్‌లో విలేకరులతో మాట్లాడారు. సొసైటీల ద్వారా నిర్వహించే కొనుగోలు కేంద్రాల ద్వారా ఆర్థిక తోడ్పాటు లభిస్తుందన్నారు. రుణాల మంజూరు, బకాయిల వసూళ్లపై సిబ్బందితో చర్చించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: దేశ సంస్కృతి, సంప్రదాయాలను యువత కాపాడాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలోని సాయిగార్డెన్‌లో జిల్లాస్థాయి యువజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై యువజనోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్వామి వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలను కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని, దానిని బయటకు తీసేందుకు యువజనోత్సవాలు ఉపయోగపడతాయన్నారు. స్వామి వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, యువత తలుచుకుంటే సాధించనిది ఏదీ లేదన్నారు. యువత చెడు మార్గంలో పయనించకుండా సన్మార్గంలో పయనించాలన్నారు. విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక కళల్లో నైపుణ్యం సాధించాలన్నారు. మండల స్థాయిలో వివిధ జానపద కళల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులను గుర్తించి, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ సాధించేలా కృషిచేసి జిల్లాకు జాతీయ స్థాయిలో మంచి పేరు, ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత వివిధ జానపద కళల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు జిల్లా యంత్రాంగం ఎల్లవేళలా సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. యువజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన అధికారులను, నృత్యాలు ప్రదర్శించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాంనాయక్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాండు, డీఎస్‌ఓ రాజశేఖర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జానపద నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పంచాయతీ ఓటర్లు @ 6,46,407

నాగర్‌కర్నూల్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం శనివారం గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా విడుదల చేసింది. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 464 గ్రామ పంచాయతీల్లో 4,138 వార్డులకు గాను మొత్తం 6,46,407 మంది ఓటర్లు ఉన్నట్లు ముసాయిదా జాబితాలో ప్రకటించింది. ఇందులో పురుష ఓటర్లు 3,23,705, మహిళలు 3,22,689 ఉండగా ఇతరులు 13 మంది ఉన్నారు. ఈ నెల 13న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించగా.. ఈ నెల 14 నుంచి 21 వరకు జిల్లావ్యాప్తంగా అభ్యంతరాలు స్వీకరించగా 6,054 వచ్చాయి. వీటిని పరిష్కరించి శనివారం ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసినట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

మండలాల వారీగా ఓటర్లు ఇలా..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
అచ్చంపేట	18,169	18,190	1	36,360
అమ్రాబాద్	13,973	14,459	0	28,432
బల్మూరు	17,688	17,263	0	34,951
బిజినేపల్లి	30,866	30,752	0	61,618
చారకొండ	10,439	10,180	2	20,621
కల్వకుర్తి	15,591	15,371	0	30,962
కోడేరు	18,262	17,638	0	35,900
కొల్లాపూర్	13,886	13,271	0	27,157
లింగాల	15,306	15,600	1	30,907
నాగర్‌కర్నూల్	17,000	17,114	0	34,114
పదర	8,649	8,395	0	17,044
పెద్దకొత్తపల్లి	24,216	23,845	3	48,064
పెంట్లవెల్లి	8,868	8,706	0	17,574
తాడూరు	15,047	15,126	0	30,173
తెలకపల్లి	22,561	22,469	1	45,031
తిమ్మాజిపేట	16,113	16,416	1	32,530
ఉప్పునుంతల	15,078	15,525	0	30,603
ఊర్కొండ	8,797	8922	0	17,719
వంగూరు	16,352	16,768	0	33,120
వెల్దండ	16,844	16,679	4	33,527
మొత్తం	3,23,705	3,22,689	13	6,46,407

లోక్‌అదాలత్‌లో 18,168 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజేష్‌బాబు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేటలోని కోర్టులలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లలో 18,168 కేసులు పరిష్కరించినట్లు జిల్లా జడ్జి రాజేష్‌బాబు తెలిపారు. లోక్ అదాలత్‌లో భూ తగాదా, బ్యాంకు, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, విద్యుత్ కేసులు రాజీ అయినట్లు పేర్కొన్నారు. జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లాలోని ప్రాంతాల్లో న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సులు నిర్వహించామని చెప్పారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూడటమే లోక్‌అదాలత్ లక్ష్యం అన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం వల్ల ఇరు పక్షాలకు సమయం, ఖర్చులు తగ్గుతాయన్నారు. శాంతియుత వాతావరణంలో లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు తమ కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జడ్జిలు మౌనిక, మమతారెడ్డి, శ్రీనిధి తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు



నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): మండలంలోని నందివడ్డెమాన్‌లో జేష్ఠ్యాదేవి సమేతంగా వెలసిన శనేశ్వరుడికి ఆలయ ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే బారులుదీరిన భక్తులు తమ ఏలినాటి శనిదోష నివారణ కోసం తిలతైలాభిషేక పూజలు, ప్రదక్షిణలు చేశారు. అనంతరం శివుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అత్యవసర సరుకుల రవాణాకు టీజీఎస్‌ఆర్టీసీ బుకింగ్ కౌంటర్లు

నాగర్‌కర్నూల్: ప్రతి పట్టణం నుంచి మండలం వరకు అత్యసర సరుకు రవాణా చేసేందుకు టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా ఆయా మండలాల్లో బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు మహబూబ్‌నగర్ లాజిస్టిక్స్ ఏటీఎం ఇసాక్ బిన్ మహమ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్‌ను ఆదరించి తద్వారా బుకింగ్ చేసుకుని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో సేవలు పొందాలని కోరారు. నాగర్‌కర్నూల్ సెల్ నం.70131 55019, కల్వకుర్తి సెల్ నం.93989 07831, ఆమన్‌గల్ సెల్ నం.99516 30659, వెల్దండ సెల్ నం.99121 51678, అచ్చంపేట సెల్ నం.96030 71924, తెలకపల్లి సెల్ నం.99485 89688, డిండి సెల్ నం.99635 95323, అమ్రాబాద్ సెల్ నం. 93985 47681, లింగాల సెల్ నం.93925 22278, కొల్లాపూర్ సెల్ నం.90109 10776, పెంట్లవెల్లి సెల్ నం.70131 02950, సింగోటం సెల్ నం.91821 22071, పెద్దకొత్తపల్లి సెల్ నం.84989 98920, కల్వకోల్ సెల్ నం.97052 81454లో కౌంటర్లు ప్రారంభించామని, అవసరమైన వారు ఆయా కౌంటర్లను సంప్రదించాలని కోరారు.

● ఆటలే ఆటలు..



పాలమూరులో క్రీడోత్సవం

ఆటలంటే ఒక ఉత్సాహం.. మైదానం చూస్తే విద్యార్థులు, క్రీడాకారులు తమ ప్రతిభను చాటేందుకు ఉవ్విళ్లూరుతుంటారు. పాఠశాల విద్యార్థుల్లో క్రీడా సందడి నింపేందుకు ఎస్‌జీఎఫ్ (పాఠశాల క్రీడా సమాఖ్య) సిద్ధమైంది. ఇప్పటికే మండల, జిల్లాస్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తుండగా.. త్వరలో రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నీలు జరగనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 'ఎస్‌జీఎఫ్' జోష్

- 15 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఆతిథ్యం
- మరో రెండు జాతీయస్థాయి టోర్నీలు నిర్వహించేందుకు అవకాశం
- అండర్ -14, 17, 19 విభాగాల మేజర్ టోర్నీల సందడి

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్‌జీఎఫ్ క్రీడా జోష్ నెలకొంది. రాష్ట్రంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు క్రీడాటోర్నీల నిర్వహణలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్‌జీఎఫ్ టోర్నీలను విజయవంతంగా నిర్వహిస్తూ వస్తున్నారు. దీంతో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా టోర్నీల కేటాయింపులో ప్రతి ఏడాది ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా రెండు జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాటోర్నీ నిర్వహించడానికి అవకాశం కల్పించారు. 2019-20లో ఉమ్మడి జిల్లాకు నాలుగు జాతీయస్థాయి టోర్నీలు కేటాయించినా కరోనా వల్ల అవి జరగలేదు. 2018 తర్వాత ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నీలు జరగనున్నాయి. ఈ ఏడాది హ్యాండ్‌బాల్ అండర్-17 బాలుర, బాలికల టోర్నీ, అండర్-19 బాలుర జాతీయస్థాయి క్రికెట్ టోర్నీలను నిర్వహించే ఆతిథ్యం పాలమూరుకు దక్కింది. వీటికి సంబంధించిన రాష్ట్రస్థాయి టోర్నీల అనంతరం.. జాతీయ స్థాయి టోర్నీ షెడ్యూల్ వస్తుంది.



2018లో పాలమూరులో నిర్వహించిన జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

■ ఇక దర్-14, అండర్-17కి సంబంధించి పది విభాగాలకు అండర్-19కి సంబంధించి ఐదు విభాగాలకు ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మొత్తం 15 రాష్ట్రస్థాయి క్రీడా టోర్నీ నిర్వహణ బాధ్యతలు ఉమ్మడి జిల్లాకు కేటాయించారు. ఇందులో మహబూబ్‌నగర్ జిల్లాకు అండర్-14 విభాగం బాలబాలికలకు హ్యాండ్‌బాల్, అండర్-14, 17 విభాగాల బాలికల కబడ్డీ, అండర్-14 బాలబాలికల రగ్బీ రాష్ట్రస్థాయి టోర్నీలు కేటాయించారు.

■ వనపర్తి జిల్లాలో అండర్-14 విభాగం బాలబాలికల ఫుట్‌బాల్, నారాయణపేట జిల్లాలో అండర్-17 బాలబాలికలు హ్యాండ్‌బాల్, అండర్-14, 17, 19 రెజ్లింగ్ (ఫ్రీస్టయిల్) టోర్నీలు నిర్వహించనున్నారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లాకు సంబంధించి అండర్-14, 17 విభాగం మల్కం, అండర్-14, 17 విభాగం బాలబాలికలకు టంగ్‌టా (మార్షల్ ఆర్ట్స్) టోర్నీలు, జోగుళాంబ గద్వాల జిల్లాకు అండర్-14 బాలుర క్రికెట్, అండర్-17 బాలబాలికలు తైక్వాండో రాష్ట్రస్థాయి టోర్నీలు కేటాయించారు.

■ అండర్-19 విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లాలో బాలుర క్రికెట్, బాలబాలికల హ్యాండ్‌బాల్, నారాయణపేట జిల్లాలో బాలబాలికల వాలీబాల్, రెజ్లింగ్ (ఫ్రీస్టయిల్), నాగర్‌కర్నూల్ జిల్లాలో బాలబాలికల మల్కం రాష్ట్రస్థాయి టోర్నీ లు నిర్వహించనున్నారు.

విజయవంతంగా నిర్వహిస్తాం..



జిల్లాకు ఈసారి మూడు రాష్ట్రస్థాయి టోర్నీతో పాటు ఒక జాతీయస్థాయి టోర్నీ కేటాయించడం సంతోషంగా ఉంది. పీడీలు, పీఈటీలు, క్రీడాసంఘాల సహకారంతో టోర్నీలను విజయవంతంగా నిర్వహిస్తాం. జిల్లాకు క్రీడా టోర్నీల నిర్వహణకు పెట్టింది పేరు. అదే స్ఫూర్తితో రాష్ట్ర, జాతీయస్థాయి టోర్నీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం. – శారదాబాయి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్

అందరి సహకారంతో..



నాగర్‌కర్నూల్ జిల్లాకు ఈ ఏడాది రెండు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా టోర్నీలు కేటాయించారు. మొదటిసారిగా జిల్లాలో ఈ ఏడాది టంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి టోర్నీ, రెండోసారి మల్కం టోర్నీ నిర్వహించనున్నాం. అందరి సహకారంతో రాష్ట్రస్థాయి టోర్నీలను పకడ్బందీగా నిర్వహిస్తాం. – మానుపాటి పాండు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, నాగర్‌కర్నూల్ జిల్లా

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


శేఖర్ (ఫైల్)

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): తిమ్మాజీపేట మండలకేంద్రానికి చెందిన వట్టిపు శేఖర్ (48) చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. శనివారం ఉదయం శేఖర్ చేపల వేట రాళ్లచెరువు తండా సమీపంలోని రాళ్ల చెరువుకు వెళ్లాడు. ఈ క్రమంలో అతను ప్రమాదవశావత్తు అందులో మునిగి చనిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. గ్రామానికి చెందిన కొందరు శేఖర్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ముగ్గురు సంతానం ఉన్నారు.

వలస కూలీ మృతి

- మహారాష్ట్రాలోని నాసిక్‌లో ఘటన


శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

మద్దూరు: మండలంలోని దోరేపల్లి బీసీకాలనీకి చెందిన ఓ వ్యక్తి మహారాష్ట్రాలోని నాసిక్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ (50) భార్యాపిల్లలను గ్రామంలోనే ఉంచి కొన్నేళ్లుగా నాసిక్‌లో ఉంటూ భవన నిర్మాణరంగంలో కూలీగా పనిచేస్తూ ఉండేవాడు. శుక్రవారం ఏడు అంతస్తుల మేడకు ప్లాస్టరింగ్ చేసేందుకు కట్టెలు కడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ కిందపడ్డాడు. వెంటనే అక్కడున్న వారు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమించడంతో ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. శ్రీనివాస్‌గౌడ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమార్తె అనిత నిశ్చితార్థం వచ్చే నెల 9న ఉందని.. వచ్చేవారం గ్రామానికి రావాల్సి ఉండగా ఇంతలో ప్రమాదం జరిగిందని భార్య అమృతమ్మ తెలిపారు. మృతదేహం ఆదివారం గ్రామానికి వస్తుందని కుటుంబ సభ్యులు వివరించారు.

ఇద్దరిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: కుమ్మెర గ్రామ సమీపంలో కొనసాగుతున్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో చోరీకి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. కుమ్మెర గ్రామానికి చెందిన మల్లేష్, భాస్కర్ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో ఇనుపసామగ్రిని చోరీ చేసి పారిపోతుండగా సెక్యూరిటీ సిబ్బంది వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్ కూరాకుల మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కడుకుంట్లలో లోకాయుక్త బృందం




వనపర్తి రూరల్: గ్రామంలోని రాయుని సముద్రం చెరువు బ్యాక్ వాటర్‌లో సుమారు 350 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని.. నష్టపరిహారం చెల్లించాలంటూ నిర్వాసితులు 2021లో లోకాయుక్తాలో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు లోకాయుక్తా బృందం సభ్యులు విద్యాసాగర్, తిరుపతి, వెంకట్‌రావు, ఆర్డీఓ పద్మావతి శనివారం రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వనపర్తి, కొత్తకోట తహసీల్దార్లు, నీటిపారుదలశాఖ అధికారులు, ఎస్ఐలు, మాజీ సర్పంచ్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

గుండె భద్రమేనా..?

ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న మరణాలు

- కరోనా తర్వాత మరింతగా..
- జీవనశైలే ప్రధాన కారణం
- నేడు వరల్డ్ హార్ట్ డే



గతేడాది నుంచి ఉమ్మడి జిల్లాలో గుండెపోటు మరణాలు అధికమైనట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఒకప్పుడు వయస్సు పైబడిన వారికి మాత్రమే వచ్చేది.. ప్రస్తుత పరిస్థితుల్లో 16 ఏళ్ల యువకుడి నుంచి 90 ఏళ్ల వృద్ధుడి వరకు గుండెపోటు బారిన పడుతున్నారు. ఇందుకు మానసిక ఒత్తిడి, ఆల్కహాల్, ఆహారపు అలవాట్లు కారణంగా చెబుతున్నారు వైద్యులు. కరోనా మహమ్మారి తర్వాత ఈ కేసుల సంఖ్య పెరిగింది. శరీరానికి పెద్ద దిక్కుగా వ్యవహరించే హృదయం లయ తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరం. ఆదివారం వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా ప్రత్యేక కథనం.

– పాలమూరు

మనిషి శరీరంలో అతి ప్రధానమైంది గుండె. ప్రస్తుత ఆధునిక జీవనంలో దీనికి భద్రత లేకుండా పోతోంది. శారీరక శ్రమ తగ్గడం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం, పొగతాగడం, ఒత్తిడితో గుండెపోటుకు గురవుతున్నారు. మారుతున్న అలవాట్లతో ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, మూత్రపిండాల సమస్యలకు దారి తీయడంతో పాటు అంతిమంగా గుండెపై ఆ ప్రభావం పడుతోందని తెలుస్తోంది. మధుమేహం, అధిక రక్తపోటుకు కారణమవుతున్న ఊబకాయ సమస్య తెలియకుండానే మూత్రపిండాలను దెబ్బతిస్తోంది. కొవ్వు పెరగడంతో గుండెపోటుకు గురై ప్రాణాలు వదులుతున్న ఘటనలు అనేకం.

జిల్లాలో 35 శాతం బాధితులు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో గుండె సంబంధిత సమస్యలతో బాధపడే వారు 35 శాతం ఉన్నట్లు అంచనా. వీరిలో మగవారు 22 శాతం, మహిళలు 13 శాతం ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో 40 శాతం ఉండగా.. పట్టణ ప్రాంతాల్లో వీరి సంఖ్య 56 శాతం ఉంటుందని వైద్యాధికారులు తేల్చారు. 10 శాతం మంది మాత్రమే చికిత్స తీసుకుని కోలుకుంటున్నారు.

20 ఏళ్లలోపు వారికి కూడా..

గతంలో 20 ఏళ్లలోపు వారు గుండెపోటుకు గురైన సంఘటనలు చాలా తక్కువ. ఎక్కువగా 50 ఏళ్లు దాటిన వారికి మాత్రమే వచ్చేది. కానీ నేడు మారిన జీవనశైలితో 20 ఏళ్ల యువత నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు గుండెపోటు వస్తోంది. ఇందులో 30 ఏళ్ల వయసున్న యువకులు అధికంగా ఉంటున్నారు. ఆస్పత్రికి వచ్చే 100 మంది రోగుల్లో 70 శాతం మంది గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారే.

వ్యాయామం చేయాలి..



ప్రతి ఒక్కరూ తమ జీవన శైలితో పాటు ఆహారపు అలవాట్లు మార్చుకునే సమయం వచ్చింది. జిల్లాలో బీపీ వ్యాధిగ్రస్తులు బాగా పెరిగిపోతున్నారు. దీనిని ప్రాథమిక దశలో గుర్తించకపోతే ఇబ్బందే. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ రోజు నడక, వ్యాయామం చేయాలి. నిద్ర సక్రమంగా ఉండేలా చూసుకోవాలి. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి.

– డా. సంపత్‌కుమార్‌సింగ్, సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

చిన్న వయసు వారికే..



గుండె లయబద్ధంగా కొట్టుకోకపోవడం, చిన్న వయసులో జనటిక్ సమస్యలతో బలహీన పడుతుంది. కరోనా తర్వాత యువకులకే ఎక్కువగా గుండెపోటు వస్తోంది. హార్ట్‌బీట్, కొలెస్ట్రాల్, బీపీ, షుగర్ క్రమం తప్పకుండా చూసుకోవాలి. వారంలో ఐదు రోజుల పాటు అరగంట వ్యాయామం చేయాలి. ఆహారపు అలవాట్లు, పొగతాగడం, మద్యపానం, వ్యాయామం లేకపోవడం, ఊబకాయం ఇవన్నీ గుండె జబ్బులకు దారితీస్తాయి. జిల్లాలో కరోనా తర్వాత 50 నుంచి 60 శాతం గుండెనొప్పి సమస్యలు పెరిగాయి. ఆయాసం, గుండెనొప్పి ఉంటే వెంటనే కార్డియాలజిస్టును సంప్రదించి చికిత్స తీసుకోవాలి. చిన్నారుల్లో ఊబకాయంతో గుండె సంబంధిత వ్యాధులు వస్తాయి. మసాలాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోరాదు. మాంసం వారానికి ఒక్కసారి మాత్రమే తీసుకోవాలి.

– డా. బాలశ్రీనివాస్, జనరల్ ఫిజీషియన్


పంచసూత్రాలు పాటించాలి..



జంక్ ఫుడ్, ఊబకాయం, ఒత్తిడితో కూడిన జీవన విధానంతో గుండెపోటు మరణాలు పెరిగాయి. ఇటీవల ఫంక్షన్లు, డీజేల దగ్గర నృత్యాలు చేస్తూ యువకులు అకస్మాత్తుగా చనిపోవడానికి కారణాలున్నాయి. అలాంటి వారు పూర్తిగా ఆరోగ్యంగా లేకపోవడం.. సరైన సమయంలో ఆరోగ్య పరిస్థితి పట్టించుకోకపోవడమే. మా దగ్గరకు వస్తున్న వారిలో చాలామంది హైపర్‌టెన్షన్‌తో బాధపడుతున్నట్లు గుర్తించాం. ప్రతి ఒక్కరూ పంచసూత్రాలు పాటించాలి. రోజుకు 6 నుంచి 7 గంటల నిద్ర, రోజు గంట వ్యాయామం, సరైన ఆహారం, రోజుకు 3 నుంచి 4లీ టర్ల నీరు తాగడం, ప్రశాంత జీవనం గడపాలి. పబ్లిక్ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు సీపీఆర్‌పై అందరు అవగాహన కలిగి ఉండాలి.

– డా. భరత్, గుండె వైద్య నిపుణుడు

జూరాలకు 1,15,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


జూరాల వద్ద దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు : జూరాలకు ఎగువ నుంచి వస్తున్న వరద జోరు కొనసాగుతోంది. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 1,15,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. 9 క్రస్టు గేట్లను ఎత్తి 63,378 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి, క్రస్టు గేట్ల ద్వారా, ఆవిరి రూపంలో, కుడి, ఎడమ కాల్వలకు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు ఇలా మొత్తంగా 99,269 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.830 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు. ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద పెరిగినట్లు తెలిపారు. ఆల్మట్టికి ప్రస్తుతం 25వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 20వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 122.308 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 32.84 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 35వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 5 గేట్ల ద్వారా 22,240 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

11 యూనిట్లద్వారా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల వద్ద దిగువ, ఎగువ కేంద్రాల్లో.. విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోంది. శనివారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్లద్వార 196 మెగావాట్లు, 208.869 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వార 240 మెగావాట్లు, 178.266 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. ఇప్పటివరకు 387.135 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసులకు శనివారం ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి 4,709 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఒక గేటును తెరిచి 2,264 క్యూసెక్కులు దిగువకు వదిలారు. ఆదేవిధంగా కేసీ కెనాల్ 2445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

కోయిల్‌సాగర్‌లో ఒక గేటు ద్వారా..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి శనివారం ఒక గేటు ద్వార నీటి విడుదలను కొనసాగించారు. పెద్దవాగు ఉధృతి తగ్గడంతో ప్రస్తుతం ఒక గేటును ఒక అడుగు మేర తెరిచి 4 వందల క్యూసెక్కుల నీటిని వాగులోకి వదులుతున్నారు.పెద్దవాగు ప్రవాహం పెరిగితే ఎక్కువ గేట్లు తెరుస్తామని అధికారులు అంటున్నారు. కాగా కోయిల్‌సాగర్ పరవళ్లను చూడడానికి వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.

శ్రీశైలంలో నీటిమట్టం 879.6 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం నీటిమట్టం 879.6 అడుగుల వద్ద 185.9926 టీఎంసీలుగా ఉంది. జూరాల, సుంకేసుల నుంచి 1,21,737 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వస్తోంది. భూగర్భ కేంద్రంలోనూ, ఏపీ.జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలోనూ విద్యుత్ ఉత్పత్తికి మొత్తంగా 37,763 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డి పాడు ద్వారా 13,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు నీటి విడుదల జరగలేదు. భూగర్భ కేంద్రంలో 13.745 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 2.721 మి.యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేశారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరుకు కొత్త గైడ్‌లైన్స్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలో విద్యార్థులకు ఇచ్చే పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు సంబంధించి ప్రభుత్వం నూతన గైడ్‌లైన్స్ విడుదల చేసిందని ఎస్సీ సంక్షేమశాఖ అధికారి సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మూడు దశల్లో దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని, అందులో డెమో అథెంటికేషన్, బయోమెట్రిక్, రిజిస్ట్రేషన్ ద్వారా ప్రక్రియ చేయాల్సి ఉంటుందని, ఈ క్రమంలో ఫ్రెష్, రెన్యువల్ విద్యార్థులు ఎస్సెస్సీ డీటైయిల్స్, ఆధార్‌కార్డు నంబర్ కచ్చితంగా ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు తప్పకుండా స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులు చేసుకునే విధంగా సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అండర్-19 టోర్నీలో పాలమూరు శుభారంభం


విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టుతో రాజశేఖర్, కోచ్ అబ్దుల్లా

- 34 పరుగుల తేడాతో వరంగల్‌పై విజయం

మహబూబ్‌నగర్ క్రీడలు: వరంగల్‌లో శనివారం నుంచి ప్రారంభమైన హెచ్‌సీఏ అండర్-19 వన్డే అంతర్‌జిల్లా లీగ్ కమ్ నాకౌట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు శుభారంభం చేసింది. వరంగల్‌తో జరిగిన మ్యాచ్‌లో జిల్లా జట్టు 34 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 34.5 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో మహ్మద్ షాదాబ్ అహ్మద్ 38 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వరంగల్ జట్టు జిల్లా బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లను కోల్పోయింది. 29.4 ఓవర్లలో 87 పరుగులకు ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్లు ఎండి.ముఖితుద్దీన్ 3, షాదాబ్ అహ్మద్ 2 వికెట్లు తీశాడు. ఉమ్మడి జిల్లా జట్టు రెండో మ్యాచ్‌ను ఆదివారం నల్లగొండ జట్టుతో ఆడనుంది. టోర్నీలో మొదటి మ్యాచ్‌ను గెలుపొందిన ఉమ్మడి జిల్లా జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు. టోర్నీలో మొదటి మ్యాచ్‌ను గెలుపొంది శుభారంభం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న మ్యాచుల్లో విజయాలు సాధించి టోర్నీ విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి

వంగూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో ప్రారంభించిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం గ్రామంలో అభివృద్ధి పనులన్నింటినీ స్వయంగా పరిశీలించారు. పంచాయతీ భవనంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. దసరాను పురస్కరించుకుని వచ్చే నెల 12న ముఖ్యమంత్రి స్వగ్రామానికి వస్తారని తెలిపారు. ఈ లోపు పనులన్నింటినీ పూర్తి చేయాలని కోరారు. ఉన్నతాధికారులే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం హెలీప్యాడ్ స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి సొంత నిధులతో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి, శివాలయాల పనులు కూడా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వచ్చేనెల 8లోగా ట్రాన్స్‌కో సీఎండీ, ఎస్పీతో కలిసి వస్తామని ఆలోపు పనులన్నీ పూర్తి కావాలని సూచించారు. సోలార్‌విద్యుత్ అందించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన కొండారెడ్డిపల్లిలో త్వరలో విద్యుత్ అందించాలని ఆయన అన్నారు. గ్రామంలోని కనీసం 30 ఇళ్లకు సోలార్ ప్లేట్లు బిగించి ముఖ్యమంత్రి చేత ప్రారంభింప చేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ దేవసహాయం, గ్రామ అభివృద్ధి పనుల నోడల్ అధికారి రమేష్, డీఆర్‌డీఏ పీడీ ఓబులేషు, జిల్లా విద్యుత్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, వేమారెడ్డి, బి.కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో యువతకు శిక్షణ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా లోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో వచ్చే నెల 9వ తేదీ నుంచి 15వ బ్యాచ్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ గల యువతకు మూడు నెలల పాటు ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ తయారీ, బ్యూటీషియన్, ఎంఎస్ ఆఫీస్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్, మొబైల్ సర్వీసింగ్, రిపే రుపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. 7వ తరగతి పాసైన వారికి జర్దోసి, మగ్గం, ఎలక్ట్రిషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి హైదరాబాద్ సెట్విన్ వారిచే సర్టిఫికెట్ ఇస్తారని, ఆసక్తిగల వారు వచ్చేనెల 8వ తేదీ వరకు పాత డీఈఓ కార్యాలయంలోని వృత్తి నైపుణ్య శిక్షణకేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. దరఖాస్తు వెంట విద్యార్హత, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో జతచేయాలని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మిగతా వివరాలకు సెంటర్ ఇన్‌చార్జి ఎస్.విజయ్‌కుమార్ (9441565895)ను సంప్రదించాలని కోరారు.

ఆయుష్మాన్ శాఖలో 120 యోగా బోధకుల పోస్టులు

- 30న ఇంటర్వ్యూలు

పాలమూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తెలంగాణ ఆయుష్మాన్ ఆరోగ్య సెంటర్ ఆస్పత్రుల్లో 120 యోగా టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ఆయుష్ విభాగ అధికారి డాక్టర్ ఆది శేషయ్య, డాక్టర్ చంద్రశేఖర్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌లో 30, వనపర్తిలో 18, నాగర్‌కర్నూల్‌లో 38, నారాయణపేటలో 16, జోగుళాంబ గద్వాల జిల్లాలో 18 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికై న పురుష బోధకులు నెలకు 32 యోగా తరగతులు, మహిళ బోధకులు 20 యోగా తరగతులకు హాజరుకావాలని.. ఇందులో పురుషులకు రూ.8 వేల వేతనం, మహిళలకు రూ.5 వేల వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఆయుష్ ఆయుర్వేద ఆస్పత్రిలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. ఈ పోస్టులకు కనీస అర్హత పదో తరగతి లేదా ఇంటర్ పూర్తి చేసి ఆరు నెలల యోగా సర్టిఫికెట్ ఉండాలని, బోధకుల పోస్టులను పార్ట్‌టైం విధానంలో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.

పాలమూరు కోర్టు పీపీగా బాలస్వామి



పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాలస్వామికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో బాలస్వామి మహిళ కోర్టు రెగ్యులర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉండగా ప్రస్తుతం జిల్లా కోర్టు పీపీగా నియమించింది. దీంతో పాటు షాద్‌నగర్ పోక్సో కోర్టు, సబ్ కోర్టు పీపీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న బాలస్వామిని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అనంతరెడ్డి, ఇతర సీనియర్ న్యాయవాదులు అభినందించారు.

న్యాయం చేయాలని పీఏసీఎస్‌కు తాళం


పీఏసీఎస్ కార్యాలయానికి తాళం వేస్తున్న బాధిత రైతు

మానవపాడు: ప్రభుత్వం వేలం వేసిన భూమిని కొనడమే తప్పా.. అలాంటప్పుడు ఎందుకు వేలం పాట నిర్వహించాలి.. అంటూ మండల కేంద్రానికి చెందిన రైతు సాయి బాబ శనివారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయానికి తాళం వేశాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మానవపాడుకు చెందిన రైతు సాయిబాబా స్థానిక పీఏసీఎస్‌లో 9.6.2023 నాడు నిర్వహించిన బహిరంగ వేలం (బకాయి పడిన రైతుకు సంబంధించిన భూమి)లో సర్వే నంబర్లు 76ఏ6, 75ఎలో 3 ఎకరాల భూమిని ఎకరా రూ.12.10 లక్షల చొప్పున మొత్తం రూ.36.30 లక్షల కొనుగోలు చేయగా.. అధికారులు సదరు రైతు పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. అయితే వేలం ద్వారా దక్కించుకున్న భూమిని పీఏసీఎస్‌కు బకాయి పడిన సదరు రైతు విత్తనం వేసిన భూమిని రాత్రి సమయంలో దున్నాతున్నాడని ఆరోపించాడు. ఈ విషయమై సహకార సంఘం, డీసీసీబీ అధికారులు, ఎస్పీ, సీఐ, ఎస్ఐలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఈ క్రమంలో శనివారం పీఏసీఎస్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తుండగా నాయకులు మురళీధర్‌రెడ్డి, అయ్యన్న, శేఖర్‌రెడ్డి, బాధిత రైతు సాయిబాబా వచ్చి తనకు న్యాయం చేయాలని పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ఇన్‌చార్జ్ కార్యదర్శి ప్రభాకర్‌నాయుడుని నిలదీసి కార్యాలయానికి తాళం వేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి తాళం వేయిరాదని, సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ విషయమై పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి స్పందిస్తూ.. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. మరోసారి విన్నవించి రైతు సమస్యను పరిష్కరించేలా చూస్తామని పేర్కొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్ మరిచిపోయారా?

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- తెలంగాణకు చివరి అగ్రవర్ణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి/ కల్వకుర్తి రూరల్/ చారకొండ: అసెంబ్లీ ఎన్నికల ముందు బహుజనుల ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేసి.. అధికారంలోకి రాగానే ఆ విషయాన్ని మరిచిపోయిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం కల్వకుర్తిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట బీసీ మహాసభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరయ్యారు. మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రంగాల్లో బీసీలు ఆగమయ్యారన్నారు. కాంగ్రెస్ హయాంలో ఉన్న 20 బీసీ గురుకులాలను 240కి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో పేదలు దౌర్జాన్యానికి గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పిన మాటలను వీరు అమలు చేయడం లేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తమిళనాడుకు అధ్యయన బృందాన్ని పంపారని చెప్పారు. బీసీ రిజర్వేషన్ కావాలంటే గ్రామ గ్రామాన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మండలానికి ఒక్క గురుకుల పాఠశాల ఇవ్వకపోగా బీసీ గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లుగానే బీసీల అభ్యున్నతికి పాటుపడాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో వచ్చేది బీసీల రాజ్యమే..

తెలంగాణ రాష్ట్రానికి చివరి అగ్రవర్ణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని, ఈ బాధ్యత తాను తీసుకుంటానన్నారు. బీసీల రిజర్వేషన్ పెంపు కోసం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి రావాలన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కులగణన చేపట్టాలని, బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారన్నారు. తాను అధికార పార్టీలో ఉన్నప్పటికీ బీసీల సంక్షేమం, మేలు కోసం పని చేస్తానన్నారు. మన ఓట్లు మనమే వేసుకుందామని పిలుపునిచ్చారు. జనాభాలో సగం ఉన్న బీసీలకు రాజకీయ రిజర్వేషన్ ఎందుకు లేదన్నారు. రాష్ట్రంలో 4.5 లక్షల మంది ఆర్యవైశ్యులు ఉన్నప్పటికీ ఒకే ఒక్క ఎమ్మెల్యే అవకాశం ఇచ్చారని, వారి కంటే తక్కువగా ఉన్న రెడ్డి, వెలమలకు 50 మంది ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. స్థానిక సంస్థలతోపాటు ఎమ్మెల్యే, ఎంపీ పదవుల్లోనూ బీసీలకు పెద్దవాటా దక్కాల్సిందేనని డిమాండ్ చేశారు. అంతకు ముందు తీన్మార్ మల్లన్న చారకొండ మండలంలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, బహుజనులకు అధికారం దక్కాలని స్వామివారిని కోరినట్లు స్థానిక విలేకరులకు చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో పల్లె రవికుమార్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, దాసరి ఉష, రాజేందర్, వెంకటయ్యయాదవ్, సదానందంగౌడ్, రమేష్‌చారి, గురువయ్య, జైపాల్, జంగయ్య, గుర్వయ్యగౌడ్, వెంకటయ్య యాదవ్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE
House for Sale 2BHK East Facing 184yds at Jadcherla M 9886154400

EDUCATION
రెగ్యులర్&డిస్టెన్స్&డిగ్రీ PG, B.Tech, Diploma, D&B- ఫార్మసీ, B.Ed, B.P. Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. 4 నెలల్లో పరీక్షలు. ఫోన్ : 8666977112, 339

SERVICES

BUSINESS OFFER
మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతి నెలా ఆదాయం కావాలా? మీ దుకాణంకి ప్రచార ప్రకటనలు జోడి చేసి ప్రతి నెలా 7000/- ఇస్తాము. Contact Numbers: 9948000374, 9948000373

HEALTH CARE

ORTHOPEDIC SURGEON
డా॥ యస్.రవితేజ రెడ్డి, M.S. (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 - 228666, 83412 99666.

GYNECOLOGY
కార్తీక్ హాస్పిటల్, సుంకేసుల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి, షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. EHS సౌకర్యం కలదు. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజీషియన్, డా॥పార్వతీదేవి, M.D.DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్:10-8PM, 08518-226162.

WANTED
డిజిటల్ ప్రింటర్స్ నందు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగము ఇవ్వబడును. హైదరాబాద్‌లో mim. Comp. నాలెడ్జ్ ఉండవలెను. పురుషులు మాత్రమే. Ph: 9989374446

భువనగిరిలో ఉన్న డాక్టర్స్ ఫ్యామిలీ వద్ద వంటపని, ఇంటిపని, ఇంట్లో చెల్లెపని చేయుటకు భార్యాభర్తలు కావలెను. ఫ్యామిలీకి జీతం : 23,000/- + రూం ఫ్రీ. ఫోన్ : 98769 10322, 92489 69041

షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో నర్సులు, కాంపౌండర్స్, వార్డ్ బాయ్స్, ఆయాలు, లేడి సూపర్‌వైజర్స్ భార్యభర్తలు కావలెను.Ph: 9391036931, 9246585901

త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధుల ను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీ వసతి + భోజనం. జీతం: 17K. ఫోన్: 8520874499, 8520980099

అర్జెంట్‌గా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మాదాపూర్, మియాపూర్, గండి మైసమ్మ ఏరియాలలో చేయుటకు కావలెను. వసతి+భోజనం ఉచితం, మంచి జీతం.ఫోన్: 9177158066, 7075906661

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ... – సాక్షి మేనేజర్